## సంఘటితంగానే అభివృద్ధి..



స్వర్ణకారులంతా సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ తొలి శాసన సభాపతి, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. వరంగల్ గిర్మాజీపేటలో నూతనంగా నిర్మించిన విశ్వకర్మ స్వర్ణకార వసతి భవనం ప్రారంభోత్సవాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

–వరంగల్ వాయిస్, వరంగల్


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 201
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
మే 10, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# అమ్మకు వందనం



- రేపు అంతర్జాతీయ మాతృదినోత్సవం
- ప్రతీయేడు మే రెండో ఆదివారం సెలబ్రేషన్స్
- 1914న యూఎస్ పార్లమెంట్‌లో చట్టం
- ఐరోపా, భారత్ లోనూ మొదలైన వేడుకలు

తన ప్రాణాలని మనకోసం పణంగా పెట్టి మనల్ని ఈ ప్రపంచానికి పరిచయం చేసి తాను కొవ్వొత్తి లా కరిగిపోతూ మన భవిష్యత్తుకు వెలుగు బాట వేసి నిరంతరం మన మంచికి మార్గం చూపి మనల్ని వెన్నంటి ఉండే ప్రత్యక్ష దైవం మాతృమూర్తి. పేరులో ప్రేమని.. పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృత మూర్తి అమ్మ. అమ్మ ప్రేమ అంత తీయనైంది కనుకే ఆ భగవంతుడు తనకు కూడా అమ్మ కావాలనుకున్నాడు. ఈ లోకాన్ని సృష్టించిన ఆ దేవాది దేవుడు కూడా మానవ రూపం ధరించి అమ్మ కడుపునే పుట్టాడు. అంత గొప్పది అమ్మ. అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. త్యాగమూ, ప్రేమా కలిస్తే అందులో నుంచి అమ్మే పుట్టుకొస్తుంది. అమ్మకు ప్రత్యామ్నాయం, షార్ట్ కట్స్ లేవు. అమ్మ ఉన్న చోట అదృష్టం పురి విప్పి ఆడుతుంది. పిల్లలపై చూపించే ప్రేమ, ఆప్యాయత, త్యాగానికి ప్రతీకగా ప్రతీయేడు మే నెల రెండో ఆదివారం అంతర్జాతీయ మాతృదినోత్సవం (మదర్స్ డే) జరుపుకునేలా 1914లో యూఎస్ పార్లమెంట్‌లో చట్టాన్ని ఆమెదించారు. గతంలో అమెరికాకే పరిమితమైన మదర్స్ డే వేడుకలు కాలక్రమేణా ఐరోపా, భారత్ లకు విస్తరించాయి. నిజానికి తల్లి చేసిన త్యాగాల ముందు మనం ఏమిచ్చినా ఆ రుణం తీర్చుకోలేం. అందుకే, వారికి పెద్ద పెద్ద గిఫ్ట్స్ ఇచ్చినా, ఇవ్వకపోయినా ఉన్నన్నీ రోజులు వారిని ఆనందంగా, ఏడవకుండా చూసుకోవడమే తల్లికి మనం ఇచ్చే విలువైన గిఫ్ట్స్. అదే ఆమెకిచ్చే అరుదైన గౌరవం. ప్రపంచంలోని మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

తన గర్భం నుంచి భూమి మీదకి తీస్కుకొచ్చి
లోకాన్ని పరిచయం చేస్తుంది అమ్మ..!
కనులు తెరిచిన క్షణం నుంచి
చివరి దుప్పటి కప్పుకొనే వరకు..
బంధం కోసం.. కుటుంబం కోసం
అందరికీ ఆత్మీయత పంచి,
అహర్నిశలు కష్టించి, తన ఇంటిని
నందనవనం చేస్తుంది అమ్మ..!
నీడలా వెన్నంటే ఉంటూ జ్ఞానాన్ని అందించే
సరస్వతీ దేవిలా పెంచుతుంది అమ్మ..!
గురువులా లోకం పోకడలు, నవసమాజ
నిర్మాణానికి అవసరమైన అన్ని అర్హతలు
కలిగి ఉన్న ఒక బాధ్యత గల పౌరురాలుగా,
పౌరుడిగా పెంచుతుంది అమ్మ..!
తొలి అడుగు తానై నడిపిస్తూ మంత్రిగా,
మార్గదర్శిగా లోపాల్ని సరిదిద్దుతూ
మన జీవితానికి పునాదులు ఏర్పరుస్తు
పెంచుతుంది అమ్మ..!
పచ్చని చెట్ల మధ్య గంతులు వేసే
జింకపిల్లలా పెంచుతుంది అమ్మ..!
తరతరాల చరిత్రకు సాక్ష్యం అమ్మ,
అమ్మ లేకపోతే జననం లేదు..
అమ్మ లేకపోతే గమనం లేదు..
అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదు..
అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు..
కంటిపాపలా కాపాడే అమ్మకి
మాతృ దినోత్సవ శుభాకాంక్షలతో..




**మంజుల పత్తిపాటి (కవయిత్రి)**
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం
ఫోన్ : 9347042218.


## శక్తి వంతమైనది సోషల్ మీడియా



2లో..

- రాజకీయ రంగంలో దీనిది ప్రముఖ పాత్ర
- సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య

## వెంటనే పరిహారం చెల్లించండి

- అధికారులకు కలెక్టర్ సత్య శారద ఆదేశం
- ఇన్నర్ రింగ్ రోడ్డు భూసేకరణపై ఆరా


2లో..



## నాంచారమ్మ జాతరకు సర్వం సిద్ధం

- ఆదివారం నుంచి జాతర
- కాకతీయుల కాలంలో నిర్మించిన పంచకూటాలయం
- నాలుగు రాష్ట్రాల నుంచి తరలి రానున్న ఎరుకల కులస్తులు


8లో..

# శక్తి వంతమైనది సోషల్ మీడియా

- రాజకీయ రంగంలో దీనిది ప్రముఖ పాత్ర
- సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలు
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య




**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** అత్యంత వేగంగా సమాచార వ్యాప్తిలో సోషల్ మీడియా ఆయుధంగా మారిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సోషల్ మీడియా వారియర్స్ వర్క్ షాప్ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపిసిసి సోషల్ మీడియా ఇంచార్జి మన్నే సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రస్తుతం వార్త ప్రసార సాధనాలతో అవసరం లేకుండా ప్రపంచంలో ఎక్కడ ఎం జరిగిన విషయం సోషల్ మీడియా ద్వారా క్షణాల్లో తెలిసిపోతుందన్నారు. అందుకే సోషల్ మీడియా అత్యంత శక్తివంతమైన సాధనంగా మారిందని తెలిపారు. ప్రస్తుతం యువత సోషల్ మీడియాకు అడిక్ట్ అయిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ రంగంలో సైతం సోషల్ మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. అందుకే కొన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాపై వందల కోట్లు ఖర్చు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక సోషల్ మీడియాను ఆయుధంగా మార్చుకొని విదేశాలలో కార్యాలయాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్యపు ప్రచారాలను చేస్తుందని ఆరోపించారు.

**సమన్వయకర్తలదే ముఖ్య పాత్ర..**

కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం సోషల్ మీడియా సమన్వయకర్తలదే ముఖ్య పాత్ర ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఫేస్ బుక్, ఎక్స్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మధ్యమాల ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రతిపక్షాల ద్వారా కలిగిన, కలుగుతున్న కష్టాలను, నష్టాలను వివరించాలన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు సేవలందిస్తూ మచ్చలేని నాయకుడిగా పేరున్న కడియం శ్రీహరిపై అసూయతో కొందరు పని లేని వ్యక్తులు అసత్యాలు ప్రచారాలు చేయాలని చూస్తున్నారన్నారు. కానీ వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 15 ఏళ్లుగా కడియం కుటుంబం వెన్నంటే ఉండి నిస్వార్థంగా పనిచేస్తున్న సోషల్ మీడియా వారియర్స్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధే కడియం శ్రీహరి ధ్యేయం అన్నారు. రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారని గుర్తు చేశారు. కడియం శ్రీహరి కుటుంబ సభ్యుల గురించి ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్, యువజన కాంగ్రెస్ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసు నమోదు




**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రానికి చెందిన 17 సంవత్సరాల బాలికకు ఇదే మండలానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బాలిక వాంగ్మూలం మేరకు పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై కొంక అశోక్ తెలిపారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు కేసును విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.




## 12 న ఓంకార్ శత జయంతి ఉత్సవాలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మద్ది కాయల ఓంకార్ శత జయంతి ఉత్సావాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నర ప్రతాప్, ఐతమ్ నగేష్ మాట్లాడుతూ బహుజన బిడ్డ ఓంకార్ ప్రతి కుటుంబానికి సొంతింటి మనిషిగా కాలం గడిపాడని, ఆయన ఆశయాలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మే12న నిర్వహించనున్న ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలి ప్రభాకర్, అప్పనపురి నరసన్న, జటబోయిన నర్సన్న, రాయినేని ఐలన్న, హెగ్గని మల్లికార్జున్, దారా శివ పాల్గొన్నారు.

## సోమవారం గ్రీవెన్స్ రద్దు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాల వల్ల దీనిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.




## ఆభరణాలు తిరిగి అప్పగింత

**వరంగల్ వాయిస్, కాజీపేట :** శనివారం ఉదయం 11గంటలకు మడికొండ గ్రామానికి చెందిన బండారి రాధిక పని నిమిత్తం మడికొండ నుంచి హనుమకొండకు వెళ్లి తిరిగి ఆటోలో మడికొండ రావడం జరిగింది. ఆమె ఆటో దిగిన తర్వాత కొద్దిసేపటికి ఆమె పర్సు ఆటోలో మర్చిపోయిన విషయం గ్రహించి వెంటనే మడికొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్ స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్ కుమార్ వెంటనే స్పందించి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్లు గోవర్ధన్, శ్రవణ్, నవీద్ లను సమాచారం చేరవేశారు. వారు దర్యాప్తు చేపట్టి అట్టి ఆటోను గుర్తించారు. రాధిక పోగొట్టుకున్న పర్సును స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి ఆమెకు చూపించగా అందులో ఆమెకు చెందిన రెండు తులాల బంగారు గొలుసు, చెవి కమ్మలు మొత్తం రూ.2లక్షల విలువైన ఆభరణాలు తిరిగి అప్పగించడం జరిగింది. పోయిన ఆభరణాలు తిరిగి దొరకడంతో రాధిక సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కిషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులను అభినందించారు.

# వెంటనే పరిహారం చెల్లించండి

- అధికారులకు కలెక్టర్ సత్య శారద ఆదేశం
- ఇన్నర్ రింగ్ రోడ్డు భూసేకరణపై ఆరా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు అందజేసిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలసి ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటులో భూములు అందజేసిన రైతులకు నష్టపరిహారం చెల్లింపు పురోగతి, దామెర చెరువు సుందరీకరణ, పైడిపల్లిలో స్పోర్ట్ సిటీ ఏర్పాటు, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ లోని నాయుడు పెట్రోల్ పంప్ నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు వయా తిమ్మాపూర్ 13 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించి రైతులు అందించిన భూములకు ఇంకను పెండింగ్ లో ఉన్న పరిహారాన్ని ఖిలా వరంగల్, ఉర్సు, ఏనుమాముల ప్రాంత రైతులకు వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కుడా ఆధ్వర్యంలో దామెర చెరువు సుందరీకరణ, అభివృద్ధి చేయనున్న దృష్ట్యా చెరువును ఇరిగేషన్ శాఖ నుంచి కుడాకు బదలాయింపుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పైడిపల్లిలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించుటకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్ ను మరింత అభివృద్ధి చేయుటకు గాను ప్రతిపాదనలు సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి కూడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి శంకర్, ఆసుపత్రి పర్యవేక్షకులు మోహన్ దాస్, తహశీల్దార్లు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ల్యాబర్తి, నల్లబెల్లిలో సదస్సులు..**

వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, నల్లబెల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన భూభారతి సదస్సులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై భూ సమస్యలపై రైతులు చేసుకొన్న దరఖాస్తులను పరిశీలించారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ విజయసారధి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాముల పరిశీలన..**


వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా గోదాములను పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కనులపండువగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**◆ ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ఆర్**



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొప్పుల గ్రామంలో కనుల పండుగగా పెద్దమ్మ తల్లి విగ్రహ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు, దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. కొప్పుల గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. మండలంలో కొప్పుల గ్రామం పెద్ద గ్రామమని ఈ గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాయకులు దేవ



సాంబయ్య, సామల మధుసూదన్,, మహేందర్ రెడ్డి, బగ్గి రమేష్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ఠాపనలో శాసన మండలి వైస్ చైర్మన్ బండా, మాజీ ఎమ్మెల్యే గండ్ర..

పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిలు అన్నారు. మండలం, లోని కొప్పుల గ్రామంలో ముదిరాజ్ ల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్ సోదర సోదరీమణులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

## అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



**వరంగల్ వాయిస్, జనగామ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. శుక్రవారం రఘునాథ్ పల్లి మండలం ఖిలా షాపూర్, జాఫర్ గూడెం, అశ్వరావు పల్లి, వెల్ది, గోవర్ధనగిరిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే కొనుగోలు ప్రక్రియ మొదలవ్వాలని, ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సరిపడా టార్పాలిన్ లను, గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అనుగుణంగా, లారీలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్, సివిల్ సప్లై అధికారులు, మండల తహసీల్దార్ పాల్గొన్నారు.

# వీరజవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటాడని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండా గ్రామానికి చెందిన గిరిజన ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీ నాయక్ దేశం కోసం సేవ చేయాలనే తపనతో ఆర్మీలో చేరి తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూ జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో భారత్– పాక్ వార్ నేపథ్యంలో పాక్ సైనికులతో దేశ రక్షణ కోసం పోరాడి వీర మరణం పొందారు. వారి ప్రాణ త్యాగం వెలకట్టలేనిదన్నారు. 25 సంవత్సరాల వయసులోనే మాతృ దేశ రక్షణ కోసం పోరాడి ప్రాణాలర్పించడం తెలుగు వారందరికీ గర్వ కారణమన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీర యోధులను జాతి ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందన్నారు. మురళీ నాయక్ కు ఘన నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వెంకట్రాములు తెలియజేశారు.

# పూర్వ ఉమ్మడి జిల్లా యువతకు గొప్ప క్రీడా అవకాశం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆదరణతో, నాయిని విశాల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "Naini T-10 League-Season2" క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 18 నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మైదానంలో ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు తొలి బహుమతిగా రూ.1,00,000, రెండవ బహుమతిగా రూ.50,000లు అందించనున్నారు. ఈ పోటీలో పాల్గొనదలచిన క్రీడాకారులకు ప్రవేశ రుసుము లేకుండా ఉచితంగా అవకాశం కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 14 వరకు కొనసాగుతుంది. పూర్వ వరంగల్ జిల్లాకు చెందిన యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ క్రీడా ప్రతిభను చాటాలని కోరారు. వివరాలకు 7075350407, 9963350284, 9398515981, 9908241902 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఈవీఎం గోదాంల పరిశీలన




**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాంలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాంలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పాత బీడు బజార్ లో కిరాణం గుమాస్తాల ఆధ్వర్యంలో మే 20న జరగనున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 78 ఏళ్ల తరువాత కూడా రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులకు ముప్పు ఎదురవుతోందని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 12 గంటల పని శ్రమను చట్టబద్ధం చేయడం, సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గించడం, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను సంక్లిష్టం చేయడం ద్వారా కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. 100 సంవత్సరాలుగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, బదులుగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి అత్యంత అవసరమని, ఈ కోడ్లను నిరసిస్తూ మే 20న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుమాస్తా కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి హక్కులు కల్పించాలని, 8 గంటల పని దినాల్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమారు, అశోక్, రమేష్, సదానందం, బావు, రామస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ శక్తితో మహిళల సాధికారికత

**◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**వరంగల్ వాయిస్, జనగామ :** మిషన్ శక్తి ద్వారా జిల్లాలోని బాల, బాలికలకు భద్రత, భరోసా కల్పించడంతో పాటు మహిళల సాధికారత కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ శాఖ ద్వారా మహిళలు సామాజిక, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం కోసం క్షేత్రస్థాయిలో మహిళా చైతన్యానికి.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు (395) అవగాహన కార్యక్రమాలను చేపట్టి.. తద్వారా జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సభ్యులకు గాను మొత్తం (31,247) మందికి మహిళా సాధికారతకు కావల్సిన అన్ని ప్రభుత్వ పథకాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. అలాగే బాల బాలికల సంరక్షణ, అభివృద్ధి, రక్షణ కోసం వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాలికలు ఉపయోగించిన శానిటరీ నాప్కిన్స్ ని చెత్త డబ్బాల్లో వేయటం వల్ల నాప్కిన్లోని ప్రమాదకరమైన రసాయనాల కారణంగా ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికల కోసం ఇన్సినరేటర్లను జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సంక్షేమ అధికారిణి, జిల్లా హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం కింద జిల్లాలోని (12) కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ కళాశాలలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఎస్టీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం రుతుక్రమ సంరక్షణకు శానిటరీ నాప్కిన్ లను దహనం చేసే ఇన్సినరేటర్ (దహన యంత్రం) లను ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా బాలికల భద్రత, రక్షణ, రుతుచక్ర పరిశుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం, తదితర అంశాలపైన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యంత జాగ్రత్తగా వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూరిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.



# చిన్నారుల్లో దాగి ఉన్న చిత్ర కళని వెలికి తీస్తాం

## ◆ సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ మంజుల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంగా మూడు సంవత్సరాల క్రితం నెలకొల్పబడిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ 22 వ చిత్రకళా పోటీలను శనివారం హనుమకొండలో గల తనిష్క్ షోరూం లోని కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి కళల్ని ప్రోత్సహించే పోటీల్లో పాల్గొని వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని, మాతృ భాషను మర్చిపోవద్దని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. పిల్లలను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలను ఒంటి చేత్తో నడిపిస్తున్న సంస్థ డైరెక్టర్ సాగంటి మంజుల భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని అభినందించారు. మంజుల మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న కళల్ని గుర్తించి, ప్రోత్సహిస్తే భవిష్యత్తులో వారు మంచి స్థాయికి ఎదుగుతారని తల్లిదండ్రులకు సూచిస్తూ పిల్లల్లో దాగి ఉన్న చిత్ర కళని వెలికి తీయడమే తన సంస్థ లక్ష్యమని అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా మాతృదేవోభవ అనే అంశం పైన 4 విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బన్న ఐలయ్యతో పాటు తనిష్క్ షో రూమ్ మేనేజర్ హరినాథ్, ప్రముఖ కార్టూనిస్ట్ చంద్ర, పిల్లలు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మురళి నాయక్ కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలుగు తల్లి కన్న బిడ్డ, భరతమాత ముద్దుబిడ్డ అయినటువంటి అగ్నివీర్ మురళి నాయక్ ఆపరేషన్ సింధూర్ కోసం జమ్ము సరిహద్దుల్లో పాక్ సైనికులతో హోరాహోరీగా పోరాడుతూ జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందారు. ఆ వీరుడి త్యాగాన్ని స్మరించుకుంటూ వరంగల్ తూర్పు పక్షాన వరంగల్ చౌరస్తా సెంటర్లో మురళి నాయక్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శిర బోయిన రాజు, బజ్జూరి వీరేశం, తౌటం సంపత్ కుమార్, పోలె పాక సాయి కుమార్ పాల్గొన్నారు

# ఘనంగా ప్రారంభమైన మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాలు చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు వేద మంత్రోచ్చారణల మధ్య శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం అంకురారోహణం విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన పూజ, యాగ్నీకులు వీరవెల్లి వేణుగోపాలాచార్యులు, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి పూజ హోమం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహం గరుడ పటం ఎగరవేశారు. తర్వాత గరుడ ముద్ర ప్రసాదాలు సంతానం లేని దంపతులకు భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వరరావు, వినుకొండ శంకరాచారి, దిండిగాల వంశీ, మామిడి ప్రమోద్, కంబత్తుల ప్రకాష్, హోంగార్డ్ మంత్రి చందు, గిద్దమారి సురేష్, నడిగట్టు సాంబయ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ స్వాములకు అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక పద్మాక్షి రోడ్డులో గల హనుమత్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, స్వామి వారికి అలంకరణ, అర్చనలు దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. నేడు 11 రోజుల హనుమాన్ మాల ధారణ జరిగింది. 400 మందికి స్వాములకు మాల దారుణ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం 500 మందికి వితరణ చేశారు. ప్రతిరోజు మహా ప్రసాదాన్ని వితరణ భక్తుల సహకారంతో చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కరుదశద్ కుమార్, గంద్రతి సుధాకర్, శంకర్, మొగులయ్య, సమ్మయ్య, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.



# పరకాల ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

## ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల :** పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ కె. సంపత్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్, అధ్యాపక బృందంతో కలిసి పరకాల చుట్టూ ఉన్న పలు గ్రామాలను సందర్శించి, కరపత్రాలతో ప్రచారం చేస్తూ, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్ మాట్లాడుతూ మా కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయడంతో పాటు, స్కాలర్ షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తూ, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్య బోధన చేస్తూ, ప్రతి ఒక్క విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, స్టడీ అవర్స్ నిర్వహించి వారిని తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఇతర పోటీ పరీక్షలకు కూడా కోచింగ్ ఇస్తూ, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ర్యాంకులు సాధించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కాలేజీలో ఎంపీసీ ,బైపీసీ చదివిన విద్యార్థులకు ఎప్ సెట్ లో ఎంత ర్యాంక్ వచ్చిన బీటెక్ లో నాలుగేళ్ల ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్మీడియట్ జనరల్ కోర్సులతో పాటు, ఒకేషనల్ విభాగంలో కూడా పలు కోర్సుల్లో, విద్యా అవకాశాలు కల్పిస్తూ, ఉద్యోగ, ఉపాధి మార్గమే లక్ష్యంగా వారిని తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా, ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి, విద్య బోధన చేయడం ద్వారా, ప్రైవేట్ కాలేజీలలో చదువుకునే విద్యార్థుల కంటే, తమ కాలేజీలో చదువుకున్న విద్యార్థులకు మంచి మార్కులు వస్తున్నాయన్నారు. తమ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ లాంటి విభాగాల్లో పాల్గొని చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యా పకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 18న పది, ఇంటర్ మెరిట్ విద్యార్థులకు అవార్డులు

## గోపా ఉమ్మడి జిల్లా ఇంచార్జి డా. చిర్ర రాజు గౌడ్



**వరంగల్, హనుమకొండ:** పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గౌడ విద్యార్థులను సత్కరించే కార్యక్రమాన్ని గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న హనుమకొండ హంటర్ రోడ్‌లోని గౌడ హాస్టల్‌లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గోపా వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ డా. చిర్ర రాజు గౌడ్ తెలిపారు. 2025 మార్చిలో జరిగిన పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలో గౌడ విద్యార్థులు మెరిట్‌లో నిలిచిన వారిని గుర్తించి, వారిని నగదు బహుమతులు, మెమెంటోలు అందించి గౌరవించనున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో 600 మార్కులకు గాను 550 పైగా సాధించిన విద్యార్థులు, ఇంటర్ రెండవ సంవత్సరం అన్ని గ్రూపులలో 1000 మార్కులకు గాను 950 పైగా సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. మార్కుల మెమో, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. వీటిని హనుమకొండ నయీమ్ నగర్‌లోని మోషన్ జూనియర్ కాలేజీలో ఈ నెల 16 సాయంత్రం లోపల సమర్పించవలెను తెలిపారు. వివరాల కోసం 9963417910 నెంబర్‌ను సంప్రదించవచ్చని డా. చిర్ర రాజు గౌడ్ సూచించారు.

# ఎన్టీఆర్, పీవీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు వెలుగు సాహితీ వేదిక, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త నిర్వహణలో తెలుగువారు గర్వించదగిన మహానటుడు విశ్వవిఖ్యాత నటరత్న పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు, సాహితీవేత్త బహుభాషా కోవిదుడు తెలుగు తేజం మాజీ ప్రధాని భారత రత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్, పీవీ నరసింహారావు పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మండలి లక్ష్మణ బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధ పూర్ణిమ, ఐరావతం, మహానంది, నటరాజ, భారత కీర్తి కిరీటి, నాట్య మయూరి పురస్కారాలను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. పురస్కారాలకు గాను ఈవెంట్ ఆర్గనైజర్, ఈవెంట్ మేనేజర్, డాన్స్ మాస్టర్లు, యాంకర్లు, సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, లాటం, చిత్రలేఖనం, శిల్పి, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముకాభినయం, హరికథ, ఒగ్గు కథ, బుర్రకథ, రంగస్థల కళాకారులు, వాస్తు, జ్యోతిష్యం, భక్తి, పురోహితం, యోగా,





క్రీడా, సామాజిక సేవా, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, డోలక్, హార్మోనియం, భజన కళా, వ్యవసాయం, కరాటే, మ్యాజిక్, టీవీ నాటక కళాకారులు, యువజన, మహిళ సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, గ్రామీణ అభివృద్ధి తదితర రంగాలలో కృషి చేస్తున్న ప్రతిభావంతులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జూన్ 15న హైదరాబాదులో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9494400158, 9100174351 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, మే 10, 2025

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయండి

■ కార్మిక చట్టాలను అమలు పర్చాలి

■ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ:** సంగెం, గీసుకొండ మండల కేంద్రంలో మే 20న జరగనున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడం లక్ష్యంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని, ఇవి పూర్తిగా కార్మికుల హక్కులను హరించేందుకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పని విధిని చట్టబద్ధం చేయడం కార్మికులపై ఆర్థిక, శారీరక ఒత్తిడిని పెంచే చర్యగా అభివర్ణించారు. సామాజిక భద్రతా పథకాల నిధుల్ని తగ్గించడం తీవ్రంగా ఖండనీయమని అభిప్రాయపడ్డారు. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి వాటిని నిర్మూలించాలనే బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. అలాగే , స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా, వారిని వెట్టి చాకిరికి గురిచేసే విధంగా కొత్త లేబర్ కోడ్స్ రూపొందించబడినట్టు ఆయన చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రమాదంలో ఉన్న ఈ పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షతను పొలబోయిన శ్రీనివాస్ వహించగా, వివిధ రంగాలకు చెందిన కార్మిక నేతలు పాల్గొన్నారు. ముఖ్యంగా, గీసుకొండ సీఐటీయూ మండల కన్వీనర్లు బ్రాహ్మచారి, దుపకి రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు మెట్టుపల్లి బాబు, కార్యదర్శి నంగునూర్ కుమార్ స్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు చిర్ర ప్రకాష్, బానోత్ రమేష్, చిర్ర సంపత్, ఎం. ప్రవీణ్, రమేష్, సదానందం, ఐలయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్లను విడుదల చేయాలి

రామ రాజేష్ ఖన్నా పిలుపు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మె నేపథ్యంలో, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా వాల్ పోస్టర్లను విడుదల చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లు కార్మిక హక్కులకు వ్యతిరేకంగా ఉండి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. మే 13, 14 తేదీలలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాల్ పోస్టర్లను విడుదల చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక, కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. గతంలో కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని అన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా అందులో పేర్కొన్న ప్రాథమిక హక్కులు ఇంకా అనేక కార్మికులకు లభించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు కార్మిక హక్కులను హరించేందుకు ఈ లేబర్ కోడ్‌లు ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో, మే 20న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో నిర్వహించే మహాధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య ఆరోగ్యశాఖల కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు.

# 12 నుంచి పెద్దమ్మ తల్లి ఉత్సవాలు



➲ మూడు రోజుల పండుగకు ఏర్పాట్లు

➲ కరపత్రాలు ఆవిష్కరించిన ఉత్సవ నిర్వాహకులు

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** మండల పరిధిలోని తిమ్మాపూర్ ఆవేల్ లో నూతనంగా ముదిరాజ్ కులస్తులకు ఇలవేల్పైన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. నూతన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రారంభ కార్యక్రమం 12న ప్రారంభమై 14 బుధవారం వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరగనున్నాయని నిర్వాహకులు శనివారం ఆలయ ప్రాంగణంలో కరపత్రాల ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి మా పూర్వీకులు ఆలయ నిర్మాణం చేయాలని అనుకునేవారని, నేడు వారి ఆశ నెరవేరుతుందన్నారు. గ్రామంలో అత్యధిక ముదిరాజ్ జనాభా కలిగిన గ్రామంగా గుర్తింపు పొంది గ్రామంలో మా కులస్తులకు ఇలవేల్పు అయిన పెద్దమ్మ తల్లి ఆలయం లేక చాలా బాధాకరంగా ఉండేదన్నారు. ఇప్పుడు మేము ముదిరాజ్ కులస్తులందరూ ఏకమై స్వచ్ఛందంగా విరాళాలు అందించడంతో పాటు, వివిధ కులాల వారు ఆర్థిక సహాయం చేసి సహకరిస్తున్నారని ఆలయ నిర్మాణ కమిటీ తెలిపారు. ఆలయం నుంరచి తిమ్మాపురం గ్రామంలో వీధి వీధినా మైకులుచ విద్యుత్ దీపాలు అమర్చి ఆలయం వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# భారత సైన్యానికి చిన్నారుల వందనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయుల క్షేమం కోసం తమ ప్రాణాలని సైతం లెక్కచేయకుండా వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు అభివందనాలు తెలియజేశారని వికాస తరంగిణి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బచ్చు రాధాకృష్ణ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు గత కొద్ది రోజులుగా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భావి తరాలు బాగుండాలని అద్భుతమైనటువంటి పోరాటం చేస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తూ, నినాదాలు ఇస్తూ, దేశభక్తి పాటలు పాడుతూ దేశ ప్రజల కోసం వీరమరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులలో ఆధ్యాత్మిక చింతనతోపాటు దేశభక్తిని నిర్మాణం చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రజ్ఞ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

# వీర జవాన్ మురళి నాయక్ కు నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత సైనికుడు మురళి నాయక్ పాకిస్తాన్ ఉగ్రవాదులను. తుది ముట్టించుటకై విరోచితంగా పోరాడి వీర మరణం పొందిన మురళి నాయక్ సంతాప సూచికంగా ఘనమైన నివాళులర్పించి మౌనం పాటించారు. తదనంతరం భారత వీర జవాన్ మురళి నాయక్ జ్ఞాపకార్థం. శనివారం శంభునిపేట జంక్షన్ లో పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేసి భారత సైన్యానికి చేదోడు వాదోడుగా ముందుండాలని కోరుకుంటూ జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో పూసల కిరణ్, దామరకొండ కరుణాకర్, కొల వరుణ్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహా రాములు, కుసుమ రాము, రాజనాల కోటేశ్వర్, కడిదల ప్రణయ్, తాళ్లపెల్లి సంబంధం, కర్నే రవీందర్, ఆడెపు చందర్, అయిత వంశీ, అసనుటి సుధీర్, వినాయక పరపతి సంఘం అధ్యక్షుడు బత్తిని వీర భద్రయ్య గౌడ్, జనార్ధన్, రాజు, రమేష్ కుమార్, కంచ మల్లయ్య, శివ ఆడెపు, అనిశెట్టి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి మంగళపల్లి శ్రీనివాస్ పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని గుర్తూర్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘం నాయకుడు సంతోష్ భార్య ఏర్పుల సంధ్య (31) అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ లో మరణించింది. కాగా, ఆమె పార్థివ దేహానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో సంధ్య ఆకస్మికంగా మరణించడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ జనార్ధన్ రాజు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఈదురు వెంకన్న, సీనియర్ నాయకులు ఏర్పుల రాములు, బొర్ర శంకర్, గుజ్జం యాదగిరి, ఏర్పుల యాకయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అబద్ధాల ప్రచారంలో ఆరితేరిన పాక్

- జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు
- రెండు రోజులుగా రెచ్చగొట్టేలా పాక్ చర్యలు
- భారత్ ప్రతిదాడులు మాత్రమే చేస్తోంది
- నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు తెగబడుతున్న పాక్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రక్షణశాఖ

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** పాకిస్తాన్ అబద్ధాలు ప్రచారం చేస్తూనే.. జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు చేస్తోందని, అయితే వీటిన భారత్ దళాలు తిప్పికొట్టాయని భారత రక్షణశాఖ వెల్లడిరచింది. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఆపరేషన్ సింధూర్‌పై ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ మీడియా సమావేశంలో మిస్త్రీ మాట్లాడుతూ.. 'గత రెండు రోజుల నుంచి పాకిస్తాన్ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తోంది. పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు భారత్ కేవలం ప్రతిస్పందిస్తోంది. పాకిస్తాన్ దాడులను అడ్డుకుంటోంది.. తిప్పికొడుతోంది' అని అన్నారు. అనంతరం కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. ' పశ్చిమ భాగం వైపు పాకిస్తాన్ దాడులకు పాల్పడుతోంది. భారత సైనికులు లక్ష్యంగా డ్రోన్లు, లాంగ్ రేంజ్ ఆయుధాలతో దాడులు చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కూడా కాల్పులకు తెగబడుతోంది. మిస్సైల్స్‌తో కూడా దాడులకు ప్రయత్నించింది. వాటిని ఆర్మీ విజయవంతంగా ధ్వంసం చేసింది. భారత ఎయిర్ బేస్‌లపై దాడులకు యత్నించింది. ఉదమ్ పూర్, పఠాన్ కోట్, ఆదమ్ పూర్‌లతో పాటు– మరికొన్ని చోట్ల కాల్పులకు తెగబడింది. పలువురు సైనికులు గాయపడ్డారని అన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇండియన్ ఎస్–400 సిస్టమ్‌ను.. సిర్సా, సూరత్ ఘర్‌లోని ఎయిర్ ఫీల్డ్స్‌ను ధ్వంసం చేసినట్లు– ప్రచారం చేస్తోంది. పాకిస్తాన్ చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలు. అందులో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాటి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. చాలా ముప్పులను భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపూర్, భుజ్, పఠాన్‌కోట్, భటిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపుర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది. దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహీమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాం. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్ కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వసం చేశాం. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్యని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతో పాటు– ఆదంపుర్‌లోని ఎస్–400 , బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు– తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మొద్దని చెప్పారు.











# పాక్ అరాచకాలకు గట్టి సమాధానం చెప్పిన మోడీ

- రక్షణ దళాలకు స్థైర్యం కలిగించాలని అమ్మవారికి మొక్కులు
- బషీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** పాకిస్తాన్ చేసిన అరాచకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గట్టిగా సమాధానం చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి గట్టిగా భారత ఆర్మీ జవాబు చెప్పిందని అన్నారు. భారత సైనికులు ధైర్యంతో, సాహసంతో వీరోచితంగా పాకిస్తాన్‌లోని 9 ప్రాంతాల్లో ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలు, ఉగ్రవాదుల ఇండ్లను మట్టు–బెట్టారని చెప్పారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేస్తోందని అన్నారు. భారతదేశం మీద జరిగిన ఉగ్రవాదుల దాడికి గానూ పాకిస్తాన్ క్షమాపణ చెప్పాల్సింది పోయి.. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో, పౌర నివాసాలపై, సైనికులకు సంబంధించిన కేంద్రాలపై దాడులు చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా పోరాటం చేస్తున్న భారత సైనికులకు ఆత్మస్థయిర్యం, శక్తి, విజయం కలగాలని శనివారం బషీర్‌బాగ్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భారతదేశానికి మద్దతుగా భక్తులు నినాదలు చేశారు. జై శ్రీ రామ్.. జై రామ్ లక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్‌కి.. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేశ భద్రత కోసం పోరాడుతున్న యోధుల రక్షణకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని కిషన్‌రెడ్డి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది భారత పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చిచంపారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలని పాకిస్తాన్ కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. మన దేశ సమగ్రత, సమైక్యతను దెబ్బతీయాలని, దేశ అభివృద్ధిని అడ్డుకోవాలని పాకిస్తాన్ చాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. గతంలో భారత సైనికులు, పౌరులను కిరాతకంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు హత్యచేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో కూడా లుంబినీ పార్కు, కోఠిలోని గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ పరిసరాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరిపి చాలామందిని పొట్టనబెట్టు–కున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ అమాయకులైన ప్రజలపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడి మండిపడ్డారు. మన దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా అందరూ ఏకమై ముక్తకంఠంతో పాకిస్తాన్ దుశ్చర్యలను ఖండిస్తున్నారని చెప్పారు. భారత సైనికులకు అండగా నిలబడ్డారని తెలిపారు. దేశ భద్రత కోసం పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లాలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక ర్యాలీలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత సైనికులకు మరింత ఆత్మస్థైర్యం కల్పించేలా ప్రజలు సంఘీభావాన్ని తెలియజేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.






# దశాబ్దాల బాధకు ఇది సమాధానం



**•• యుద్ధంపై జాన్వీకపూర్ పోస్ట్**

పాకిస్థాన్–భారత్ యుద్ధ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. సామాన్యుడి నుంచి సెలబ్రిటీల దాకా అందరూ ఇండియన్ ఆర్మీకి మద్దతు పలుకుతున్నారు. జాన్వీకపూర్ ఇప్పటికే వరుసగా పోస్టులు పెడుతూ ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తోంది. తాజాగా యుద్ధ వాతావరణం గురించి సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఇన్ని రోజులు మనం యుద్ధం రావొద్దనే కోరుకున్నాం. కానీ టెర్రరిస్టుల మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. ఇండియా ఎన్నడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడులను తిప్పి కొడుతున్నాం. కానీ దశాబ్దాల బాధ ఇప్పుడు పెరిగింది. ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ఇది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. –టె–ర్రరిస్టులు అనే వారు భూమ్మీద ఉండటానికి వీల్లేదు. మన సైనికులు బార్డర్ దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సౌభ్రాతృత్వాన్ని కాపాడుతున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సేఫ్ గా ఉంటు–న్నాం. ఇలాంటి –టైమ్ లో దేశమంత మన ఇండియన్ ఆర్మీకి మద్దతు నిలవాలి. ఎలాంటి ఫేక్ న్యూస్ ను వ్యాప్తి చేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ

# నాకు తెలియకుండానే హీరోను చేశారు

శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్ మూవీపై వెన్నెల కిషోర్ తాను హీరో అని తనకే తెలియకుండా ఒక సినిమా చేసినట్లు– వెన్నెల కిషోర్ చెప్పుకొచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, వెన్నెల కిషోర్ కీలకపాత్రలో 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాలో హీరో వెన్నెల కిషోర్ అని ముందు నుంచి సినిమా టీం చెబుతూ వచ్చింది. అంతేకాక, వెన్నెల కిషోర్ ప్రమోషన్స్‌కి ఎందుకు రాలేదు అంటే, అది ఆయన్ని అడగాలంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ అయింది. ఈ విషయం మీద వెన్నెల కిషోర్ స్పందించాడు. నాకు నేను ఈ సినిమాలో హీరో అనే సంగతి తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను. ఎందుకంటే కొంతమంది కథ మొత్తం అడిగితే ఫీల్ అవుతున్నారు. కాబట్టి నా వరకు ట్రాక్ చెప్పమన్నాను, చెప్పారు. ఏడు రోజుల డేట్స్ ఇచ్చాను, షూట్ చేశాను. తర్వాత ఇంకొన్ని ఎమోషనల్ సీన్స్ యాడ్ చేయాలన్నారు. వెళ్లి నటించి వచ్చాను. సినిమా రిలీజ్ సమయంలో నేను హీరో అని పోస్టర్ వేస్తే ఆశ్చర్యపోయాను. అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు ముందు చెప్పినప్పుడు ఆ సినిమాలో వేరే హీరో ఉన్నాడు, అతనికి జంటగా అనన్య నాగాళ్ల నటిస్తుందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇది నాకు తెలియకుండా జరిగింది. ముందే నాకు దర్శక నిర్మాతలు నేనే హీరోనని చెప్పి ఉంటే, అప్పుడు నేను ప్రమోషన్స్‌కి కూడా వచ్చి ఉండేవాడినేమో అంటూ ఆయన మాట్లాడారు.



# మరోమారు విజయ్, రష్మికల జోడీ

విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి.సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక. బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 – 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యానముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు – శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు–గా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు– తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు– తన క్లాత్ బ్రాండిరగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు– ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.







# బాలీవుడ్‌లో ఆపరేషన్ సిందూర్..!

'ఆపరేషన్ సిందూర్' శత్రుదేశం వెన్నులో వణుకుపుట్టిస్తోన్న పేరిది. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకొంటున్న ఈ పేరుతో సినిమా రానుంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్‌లో సినిమాను తెరకెక్కించనున్నారు. దీనిపై అధికారిక ప్రకటన చేసి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ్ నితిన్ దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో యూనిఫాం ధరించి.. రైఫిల్ పట్టుకొని నుదుటన సిందూరం పెట్టుకుంటోన్న మహిళను చూపారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్‌లో ఫైటర్ జెట్‌లను, మండుతున్న యుద్ధ భూమిని చూపారు. ప్రస్తుతం భారత్ – పాక్‌ల మధ్య జరుగుతోన్న ఉద్రిక్తతలను, పహల్గాం సంఘటనను ఈ చిత్రంలో చూపనున్నట్లు– స్పష్టమవుతోంది. త్వరలోనే ఇందులో నటించనున్న నటీ–నటు–ల వివరాలను వెల్లడిరచనున్నారు. ఉగ్రవాద లోకానికి వణుకు పుట్టించిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీసేందుకు సినీ దర్శక నిర్మాతలు పోటీ–పడ్డారు. ఈ పేరును ప్రకటించినప్పుడే సుమారు 15 నిర్మాణ సంస్థలు దీనికోసం రిజిస్టర్ చేసుకున్నాయి. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ స్టూడియోస్, టీ––సిరీస్ లాంటి కొన్ని బాలీవుడ్ బడా నిర్మాణసంస్థలు కూడా ఈ పేరు కోసం పోటీ–పడుతూ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

# నాంచారమ్మ జాతరకు సర్వం సిద్ధం

- ఆదివారం నుంచి జాతర
- కాకతీయుల కాలంలో నిర్మించిన పంచకూటాలయం
- నాలుగు రాష్ట్రాల నుంచి తరలి రానున్న ఎరుకల కులస్తులు





**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ఎరుకల నాంచారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. ప్రతి యేడు వైశాఖ శుద్ధ పౌర్ణమి మే 12 నుంచి వారం రోజుల పాటు జాతరను నిర్వహించేందుకు ఎరుకల కులస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలుగుజాతిని ఏకం చేసి పరిపాలించిన కాకతీయుల కాలంలో రామప్ప దేవాలయంతో పాటు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో 800 సంవత్సరాల క్రితం ఎరుకల నాంచారమ్మ (పంచకూటాలయం) దేవాలయం నిర్మించారు. అరుదైన నల్లసేనపురాయితో చెక్కబడిన ఐదు శివలింగాలను ఇతర అద్భుతమైన శిల్పాలను పునర్నిర్మాణం పేరుతో పురావస్తు శాఖ అధికారులు రామానుజపూర్ గ్రామ సమీపానికి తరలించారు. తర్వాత కాలంలో పట్టించుకోకపోవడంతో భవిష్యత్ తరాలకు అందించాల్సిన అరుదైన శిల్ప సంపద కాలగర్భంలో కలిసిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024లో నిర్వహించిన జాతరలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

### 2018 నుంచి జాతర..

ఎరుకల నాంచారమ్మ దేవాలయంగా పిలుచుకునే పంచకూటాలయం పంట పొలాల మధ్య ఉండడంతో ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎరుకల కులస్తులను ఏకం చేసిన తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు 2018 ఏప్రిల్ 29న మొదటిసారి నాంచారమ్మ జాతరను నిర్వహించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ వారి సహకారంతో జాతరకు ప్రతి ఏడాది కావలసిన సౌకర్యాలను మెరుగుపరుస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహిస్తున్నారు. తక్కువ జనాభా కలిగిన ఎరుకల కులస్తులు తమ ఆరాధ్య దైవం అయిన నాంచారమ్మ దర్శనం కోసం ప్రతి సంవత్సరం రామానుజాపూర్ తరలివస్తున్నారు.

### నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు..

వైవిధ్యమైన జీవన విధానం కలిగిన ఎరుకల కులస్తులు జాతరలో సందడి చేస్తారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ రాష్ట్రాల నుంచి సైతం నాంచారమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ప్రతి ఏడాది ఎరుకల కులస్తులు తరలివస్తున్నారు. జాతరలో మొదటి రోజు నాంచారమ్మ , ఏకలవ్యుని వేషధారణలతో వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామం నుంచి రామానుజాపూర్ వరకు డప్పు చప్పుల్లతో తరలిస్తారు. అక్కడ నుంచి శివసత్తుల పూనకాలు, భక్తుల సందడి మధ్య నాంచారమ్మ జాతర వరకు తరలి వెళ్తారు. ఎరుకల కులస్తులు ఆచారాల ప్రకారం నాంచారమ్మకు బోనంతో మొక్కులు చెల్లించుకుంటారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జాతరను నిర్వహిస్తుండగా కుర్రో కుర్రు..అంటూ సోది (భవిష్యత్) చెప్పేందుకు ఎరుకల యువతులు, మహిళలు, వృద్ధులు నాంచారమ్మ వేషధారణలతో సందడి చేస్తారు. లిపిలేని వీరి భాష ప్రత్యేకంగా ఉంటుంది. రామానుజాపూర్ గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరం వరకు భక్తులతో కలిసి సందడిగా తరలి వెళ్తారు. వారం రోజుల పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నాంచారమ్మకు మొక్కులు చెల్లిస్తారు. తిరుగువారం ఎరుకల కులస్తులు ప్రత్యేకమైన మొక్కులు చెల్లించడంతో జాతర ముగుస్తుంది.

### విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు..

**- లోకిని రాజు**

పునర్నిర్మాణం పేరుతో విగ్రహాలన్నీ తరలిపోవడంతో ఇప్పటివరకు ప్రతి ఏడాది అక్కడే ఉన్న ప్రత్యేకమైన శిలను నాంచారమ్మగా భావించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ఆధ్వర్యంలో నాంచారమ్మ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి విగ్రహ ప్రతిష్టాపన చేసేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 12న వేద పండితుల సమక్షంలో జాతరతో పాటు నాంచారమ్మ విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించేందుకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రతి ఒక్కరు సహకరించి జాతరను విజయవంతం చేయాలని లోకిని రాజు కోరారు.



# ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్

- భారత్ - పాక్‌ల మధ్య కాల్పుల విరమణ
- అధికారిక ప్రకటన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్ పడింది. భారత్ – పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరుదేశాలు అంగీకరించినట్లు భారత్ విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ధృవీకరించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు భారత్ డీజీఎంఓకి పాక్ డీజీఎంఓ ఫోన్ చేసి కాల్పులు విరమించాలని కోరినట్లు మిస్రీ తెలిపారు. ఈనెల 12న సాయంత్రం 5 గంటలకు మరోసారి ఇరుదేశాల డీజీఎంఓల మధ్య చర్చలు జరగనున్నట్లు చెప్పారు. మరోవైపు పాక్ మంత్రి ఇషాక్‌దర్ కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. భారత్–పాక్‌లతో జరిపిన చర్చలపై అమెరికా కార్యదర్శి రూబియో స్పష్టత నిచ్చారు. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో కలిసి ఇరుదేశాలతో చర్చలు జరిపినట్లు ప్రకటించారు. ఇరుదేశాల ప్రధానమంత్రులతో పాటు భారత్ విదేశాంగశాఖ మంత్రి జై శంకర్, అజిత్ దోవల్ తో, పాక్ ఆర్మీ చీఫ్ అసిఫ్ మునీర్, పాక్ ఎన్ఎస్ఏ మాలిక్ తోనూ చర్చలు జరిపామన్నారు. అమెరికా దౌత్యంతో భారత్ – పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని రూబియో స్పష్టం చేశారు.



# 38 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లో వివిధ కేడర్లలో పనిచేసిన సభ్యులు
- 'ఆపరేషన్ చేయూత' ఎఫెక్ట్

**వరంగల్ వాయిస్, కొత్తగూడెం :** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆపరేషన్ చేయూత'కు విశేష స్పందన లభిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు 265 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస విధానాలు, శాంతియుత జీవనంపై ఆశతో, నిషేధిత సీపీఐ–మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట 38 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు పార్టీ సభ్యులు, 16 మంది మిలీషియా సభ్యులు, ఏడుగురు గ్రామ కమిటీ సభ్యులు, ఆరుగురు క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ సభ్యులు, ముగ్గురు చేతన నాట్యమంచ్ సభ్యులు, నలుగురు గెరిల్లా రివల్యూషనరీ డిస్ట్రిక్ట్స్ సభ్యులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారికి పునరావాసం నిమిత్తం ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయంగా చెక్కులను ఎస్పీ అందజేశారు.

# ఆపరేషన్ కగార్‌కు సింధూర్ ఎఫెక్ట్

- తాత్కాలికంగా నిలిచిన మావోల ఏరివేత
- కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి
- సరిహద్దుకు వెళ్లేలా ఆదేశాలు

**వరంగల్ వాయిస్, ములుగు :** ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్ పడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్ – పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్– పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్–పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com